సాక్షి
జగిత్యాల
బుధవారం : 26 : జూలై : 2023



నేడు ఎస్సారెస్పీ నీటి విడుదల

జగిత్యాల అగ్రికల్చర్ : జిల్లాకు తాగు, సాగునీరు అందించే ఎస్సారెస్పీ నుంచి బుధవారం వానాకాలం పంటలకు నీరు విడుదల చేస్తారు. - 8లో▸



మండలంగా ప్రకటించాలి

కథలాపూర్ : మన్నెగూడేన్ని మండలంగా ప్రకటించాలని గ్రామస్తులు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌కు విన్నవించారు.

గరిష్టం/కనిష్టం
28.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జీవించే హక్కు ఉండాలి



మాట్లాడుతున్న భీంరెడ్డి

జగిత్యాలక్రైం: గల్ఫ్ కార్మికులు తమ కుటుంబాలతో కలిసి జీవించేహక్కు అమలు చేయాలని ఆసియా గల్ఫ్ దేశాల సమావేశంలో మంద భీంరెడ్డి కోరారు. 'వలస కార్మికుల సామాజిక రక్షణ' అంశంపై మలేషియా రాజధాని కౌలలంపూర్‌లో మంగళవారం ప్రారంభైన వివిధ దేశాల ప్రాంతీయ సమావేశాల్లో గల్ఫ్ వలస వ్యవహారాల నిపుణుడు మంద భీంరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఏటా ఒకనెల వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని ఉద్యోగ ఒప్పందాల్లో ఉన్నప్పటికీ అమలు కావడం లేదన్నారు. అంతర్జాతీయ వలస కార్మికులకు ఆన్‌లైన్ ఓటింగ్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. వచ్చే సంవత్సరం భారత్, ఇండోనేషియా, బంగ్లాదేశ్‌లో జరిగే ఎన్నికల్లో ప్రవాసుల ప్రభావం ఉంటుందన్నారు. ఫిలిప్పీన్స్ కేంద్రంగా పనిచేసే మైగ్రెంట్స్ ఫోరం ఇన్ ఏషియా నిర్వహించిన ఈ సమావేశంలో ఆగ్నేయాసియా, గల్ఫ్, ప్రాచ్య దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'అసమర్థ ఎంపీ అర్వింద్'



మాట్లాడుతున్న వసంత

జగిత్యాలజోన్: అసమర్థ ఎంపీ అర్వింద్ అని, ఆయన మాటలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత ధ్వజమెత్తారు. జెడ్పీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. అప్పటి ఎంపీ కవిత సహకారంతో జిల్లాలో 4,250 డబుల్ బెడ్రూమ్ ఇళ్లను మంజూరు చేసుకోవడమే కాకుండా నిర్మాణాలు కూడా పూర్తిచేశామని చెప్పారు. నిజామాబాద్ పార్లమెంట్ ప్రజలను మోసం చేసి గెలిచిన ఘనత అర్వింద్‌ది అని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ కవిత, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌పై నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఆమె హెచ్చరించారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



పరిసరాలు పరిశీలిస్తున్న శ్రీనివాస్

జగిత్యాలరూరల్: వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్‌ఈవో శ్రీనివాస్ సూచించారు. మంగళవారం రాయికల్ మండలం అల్లీపూర్ మహాత్మా జ్యోతి బా పూలే పాఠశాల, ఉప్పుమడుగు కేజీబీవీ, ఇటిక్యాల మోడల్ స్కూల్, ఒడ్డెలింగాపూర్ మినీ గురుకులం, ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ ప్రదేశాల్లో ఆయన పర్యటించారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు దోమ లబారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీధర్, హెల్త్ అసిస్టెంట్ భూమయ్య, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు


జగిత్యాలరూరల్: విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తపస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నరేందర్‌రావు కోరారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తక్షణమే పీఆర్సీపై కమిటీలు వేయాలని, ఐఆర్ వర్తింపజేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, బదిలీలు, ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. నూతన డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఒడ్నాల రాజశేఖర్, బోనగిరి దేవయ్య, రాజేందర్, రమేశ్, రజనీకాంత్, తీగల శ్రీనివాస్, మునీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇలా వచ్చి.. అలా వెళ్తోంది

వృథాగా పోతున్న వరదనీరు



ప్రధాన కాలువ ద్వారా వృథాగా వెళ్తున్న గుట్టల నుంచి వచ్చే వరదనీరు



మూడోతూముకు గేట్లు బిగించాల్సింది ఇక్కడే

- నర్సింహులపల్లిని ముంచెత్తిన నీళ్లు
- గ్రామస్తులు, రైతుల ఆందోళన
- గేట్లు బిగిస్తే నీటి నిల్వలు
- అనుమతి మంజూరుకు అటవీశాఖ మెలిక

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్‌లోని రోళ్లవాగు ప్రాజెక్టు నిర్మాణం చివరి దశకు చేరింది. కేవలం ఆరు గేట్లు(షటర్లు) బిగిస్తే పనులు పూర్తవుతాయి. ఇందుకోసం అటవీ శాఖ అనుమతి రావాల్సి ఉంది. నేటికీ అనుమతి మంజురు కాలేదు. దీంతో గేట్లు బిగించలేదు. ప్రస్తుతం కురుస్తున్న భారీవర్షాలతో వచ్చే వరద వచ్చింది వచ్చినట్లే తూముల ద్వారా దిగువకు వృథాగా పోతోంది. బుధవారం ఎస్సారెస్పీ నుంచి కూడా విడుదల చేస్తారు. ఈ నీరు కూడా వృథాగా పోతుందని, తద్వారా ప్రాజెక్టు కట్టి ప్రయోజనం ఏమిటని ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నారు.

నిర్మాణానికి రూ.136కోట్లు..

→ బీర్‌పూర్, నర్సింహులపల్లె, చెర్లపల్లి, గణేశ్‌పల్లి(పోతారం) శివారులో రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునికీకరణ పనునలు చేపట్టారు.

→ రూ.136 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు.

→ దాదాపు 90 శాతం నిర్మాణం పూర్తయ్యింది.

→ నీటినిల్వ సామర్థ్యం 0.25 టీఎంసీ నుంచి 1 టీఎం టీఎంసీకి పెంచడం లక్ష్యం.

→ సమీపంలోని గుట్టల నుంచి వచ్చే వరద, ఎస్సారెస్పీ నుంచి విడుదల చేసే నీటితో ప్రాజెక్టు నిండుతుంది.

→ దీనిద్వారా బీర్‌పూర్, ధర్మపురి మండలాల్లోని 25 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తారు.

→ ఇందుకోసం మూడు తూములు నిర్మించారు. ఒక్కో తూముకు రెండు చొప్పున మొత్తం ఆరు గేట్లు బిగించాల్సి ఉంది.

→ 13 జూలై 2022లో 60శాతం వరకు పనులు పూర్తయ్యాయి. అదేరోజు రాత్రి కురిసిన భారీవర్షాలకు ప్రాజెక్టు కట్ట తెగింది.



బీర్‌పూర్ శివారులోని రోళ్లవాగు ప్రాజెక్టు

→ కట్టణ నిర్మాణం పూర్తయ్యింది కానీ, గేట్ల బిగింపు, ఇతర పనులే మిగిలాయి.

గేట్ల ఏర్పాటుకు రూ.75 లక్షలు..

చెర్లపల్లివైపు తూము ద్వారా 110 క్యూసెక్కులు, మధ్యలోని మరో తూము ద్వారా 80 క్యూసెక్కులు, మూడోతూము (శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం వైపు) నుంచి 200 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తారు. వీటికి ఏర్పాటు చేసే గేట్లకు రూ.75లక్షల వ్యయం అవుతుందని అంచనా వేశారు.

అటవీశాఖ కొర్రీలు..

ప్రాజెక్టుకు గేట్లు బిగిస్తే అటవీ శాఖకు చెందిన సుమారు 900 ఎకరాల్లోని చెట్లు నీట మునుగుతాయని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే, గేట్లు బిగించడానికి అటవీ శాఖ అనుమతి తప్పనిసరి అని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.

ముంపు ప్రాంతానికి బదులు మరోచోట..

→ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించి సుమారు ఆరేళ్లవుతోంది.

→ ఇప్పటి వరకు అటవీశాఖ అనుమతి రాలేదు.

→ అయితే, 900 ఎకరాలు ముంపునకు గురవుతాయని అటవీ, రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులు సర్వేలో తేల్చారు.

→ ముంపునకు గురవుతున్నందున ప్రత్యామ్నాయంగా పెగడపల్లి, ల్యాగలమర్రి, నంచర్ల, దీకొండ, గొల్లపల్లి మండలం చందోళి శివారుల్లోని 900 ఎకరాల రెవెన్యూ భూములు కేటాయించడానికి రెవెన్యూ అధికారులు సిద్ధం చేశారు.

→ అంతేకాదు.. ప్రాజెక్టుకు కేటాయించిన నిధుల్లోంచి అటవీశాఖకు రూ.8కోట్లు చెల్లించడానికి కేటాయింపులు చేశారు.

→ కలెక్టర్ అనుమతి కోసం నివేదిక పంపించారు.

→ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన కలెక్టర్.. నివేదికను ఉన్నతాధికారుల అనుమతి కోసం పంపించారు. కారణాలు తెలియదు కానీ, ఫైల్ అక్కడే ఆగి పోయింది. అయితే, మంగళవారం రాత్రి వరద ఉధృతి పెరగడంతో నర్సింహులపల్లిని ముంచెత్తింది.



తూము నుంచి వృథాగా పోతున్న వరద నీరు

అటవీ అనుమతులు వస్తేనే..



అటవీ శాఖ అనుమతి లభిస్తేనే ప్రాజెక్టు మూడు తూములకు ఆరు గేట్లు బిగిస్తాం. అప్పటిదాకా వరద నీటిని తూములకు అనుసంధానించి వానాకాలం పంటలకు అందిస్తాం. యాసంగి ఆరంభానికి ముందే అనుమతి వచ్చే అవకాశం ఉంది.

– చక్రూనాయక్, డీఈ, రోళ్లవాగు ప్రాజెక్టు

దంచికొట్టిన వాన





రాయికల్- మూటపల్లి మధ్య కాజ్‌వేపై వరద



జగిత్యాల విద్యానగర్‌లో చిత్తడైన రోడ్డు

- నెమ్మదిగా నిండుతున్న జలాశయాలు
- మంగళవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జోరువానలు
- మరో రెండు రోజులు పాత కరీంనగర్‌కు రెడ్ అలర్ట్
- కడెం గేట్లు ఎత్తడంతో గోదావరికి భారీగా పెరిగిన వరద
- ఎల్లంపల్లి ఎనిమిది గేట్ల ద్వారా దిగువకు నీరు విడుదల

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాలో వాన దంచికొడుతోంది. వర్షం ధాటికి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మరో రెండు రోజులు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు భారీ వర్ష సూచన ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. ఈనెల 27న భారీ వర్షం ఉంటుందని, మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. తెరిపిలేని వానతో జలాశయాలు కళకళలాడుతున్నాయి. పాత జిల్లాకు ప్రాణాధారమైన మిడ్‌మానేరు, లోయర్ మానేరు ప్రాజెక్టులు నెమ్మదిగా నిండుతున్నాయి.

లోయర్ మానేరు..

దిగువమానేరు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 24 టీఎంసీలకు గాను ప్రస్తుతం 13 టీఎంసీల నీరు నిల్వ ఉంది. లోయర్ మానేర్ డ్యామ్ (ఎల్ఎండీ)కు 8,869 క్యూసెక్కుల వరద స్థిరంగా వస్తోంది. మొన్నటివరకు కాళేశ్వరం ఎత్తిపోతల నుంచి నీరు మిడ్‌మానేరు మీదుగా లోయర్ మానేరు చేరింది. ఇందులో మానేరు నది నుంచి 7,339 క్యూసెక్కుల నీరు వస్తుండగా, మిడ్‌మానేరు నుంచి కేవలం 1530 క్యూసెక్కులే వస్తోంది. శనివారం నుంచి మంగళవారం వరకు కేవలం ఒక టీఎంసీ నీరు వచ్చి చేరింది. వాస్తవానికి సోమవారం గేట్లు తెరిచి మంత్రి గంగుల కమలాకర్ చేతుల మీదుగా నీటిని విడుదల చేద్దామనుకున్నారు. కానీ.. భారీ వర్ష సూచనతో కార్యక్రమం రద్దయింది.

మిడ్‌మానేరు..

27 టీఎంసీల సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులో ప్రస్తుం 15 టీఎంసీల నీరునిల్వ ఉంది. మూలవాగు, మానేరు నదిల నుంచి వరద 6,500 క్యూసెక్కులుగా వచ్చి చేరుతోంది. అవుట్‌ఫ్లో కేవలం 1,530 క్యూసెక్కులుగా దిగువ మానేరుకు వదులుతున్నారు.

ఎల్లంపల్లి..

20 టీఎంసీల సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులో ప్రస్తుతం 16 టీఎంసీల నీరునిల్వ ఉంది. గోదావరి నది నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టుకు మంగళవారం భారీగా వరద పోటెత్తింది. ఉదయం నుంచి 59,504 క్యూసెక్కుల వరద వస్తుండగా.. అదే స్థాయిలో 59,504 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం ఎనిమిది గేట్లు ఓపెన్ చేశారు. ఎగువన వర్షాలు కురుస్తుండటంతో నది క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 43,412 క్యూసెక్కుల వరద, కడెం ప్రాజెక్ట నుంచి 16,042 క్యూసెక్కల నీరు భారీగా వచ్చి చేరడంతో ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో ఒక్కసారిగా పెరిగింది.

కరీంనగర్‌లో..

జిల్లాలో వర్షం దంచికొట్టింది. గత నెలలో లోటు వర్షపాతం నమోదుకాగా, పక్షం రోజులుగా కురుస్తున్న వర్షాలతో సాధారణానికి మించి వర్షపాతం నమోదైంది. శంకరపట్నం, మానకొండూరులో అలుగులు పారుతున్నాయి. మోయతుమ్మెద వాగుకు వరద ఇప్పుడే మొదలైంది. మంగళవారం జిల్లావ్యాప్తంగా భారీ వర్షంపడగా అత్యధికంగా జమ్మికుంటలో 10 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఇల్లందకుంటలో 9.8, గన్నేరువరం 8.6, చిగురుమామిడి 7.6, సైదాపూర్ 7.3, హుజూరాబాద్ 7.2, శంకరపట్నం 6.5, తిమ్మాపూర్ 6.4, కరీంనగర్ అర్బన్, మానకొండూర్ 4.6, వీణవంక 4.5, చొప్పదండి 4.1, గంగాధర, రామడుగు 3.9, కొత్తపల్లి 3.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

వర్షపాతం (మి.మీ.లలో)

మండలం	వర్షపాతం
ఇబ్రహీంపట్నం	20.1
మల్లాపూర్	19.8
రాయికల్	46.6
బీర్‌పూర్	29.4
సారంగాపూర్	48.1
ధర్మపురి	31.6
బుగ్గారం	51.5
జగిత్యాలరూరల్	40.7
జగిత్యాలఅర్బన్	35.5
మేడిపల్లి	34.2
కోరుట్ల	20.1
మెట్‌పల్లి	18.0
కథలాపూర్	27.5
కొడిమ్యాల	22.2
మల్యాల	22.5
పెగడపల్లి	25.0
గొల్లపల్లి	30.4
వెల్గటూర్	38.1
ఎండపల్లి	34.7
బీమారం	32.9

ప్రాజెక్టు..	సామర్థ్యం టీఎంసీలలో	ప్రస్తుతం టీఎంసీలలో	ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో	ఔట్‌ఫ్లో క్యూసెక్కుల్లో
మిడ్‌మానేరు	27.50	15.98	6500	1530
లోయర్‌మానేరు	24.03	13.25	8869	257
ఎల్లంపల్లి	20.17	16.01	5712	12,721

అమ్మా.. మందులు ఇస్తున్నారా..

- ఆరా తీసిన కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: 'అమ్మా.. మందులు, గోలీలు ఇస్తున్నారా.. ఆరోగ్యం బాగుంటుందా' అని కలెక్టర్ యాస్మిన్ బాషా ఆస్పత్రిలోని పేషెంట్లను పలుకరించారు. పట్టణంలోని తారకరామనగర్, పట్టణ ఆరోగ్య కేంద్రాలను మంగళవారం కలెక్టర్ సందర్శించారు. వైద్యసేవలపై ఆరా తీశారు. రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. ఆకుకూరలు, పప్పు దినుసులు, బెల్లంపట్టీలు ప్రతీరోజు ఆహారంగా తీసుకోవాలని సూచించారు. రోజూ 5 లీటర్ల శుద్ధమైన నీటిని తాగాలని పేర్కొన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబానికి సేవలు అందుతాయని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వేడి చేసి చల్లార్చి వడబోసిన నీటినే తాగాలని పేర్కొన్నారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆస్పత్రిలో నీటి నిల్వలు లేకుండా ఉంచుకోవాలన్నారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో మంచిచికిత్స అందించాలని ఆదేశాలు జారీచేశారు. అక్కడకు వచ్చిన మహిళలు.. అన్నీ బాగానే ఇస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శ్రీధర్, డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్ జైపాల్ రెడ్డి, తహసీల్దార్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

స్వీపర్లను క్రమబద్ధీకరించాలి

- సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి
- సీఐటీయూ జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన

జగిత్యాలటౌన్: సుమారు 30ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్ల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన డిమాండ్ చేశారు. వేతనాల పెంపుతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ప్రభుత్వ పాఠశాలల స్వీపర్లు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం 12వ రోజుకు చేరాయి. దీక్షలో పాల్గొన్న స్వీపర్లకు మద్దతు ప్రకటించిన ఇందూరి సులోచన.. అనంతరం మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. ఏపీఎస్ రెడ్డి హైపర్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని కోరారు. అర్హతను బట్టి పదోన్నతులు కల్పించాలని, పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సబార్డినేట్ పోస్టుల్లో భర్తీ చేయాలని, పదో పీఆర్సీ సిఫారసులను అమలు చేసి లాస్ట్ గ్రేడ్ స్కేల్ అమలు చేయాలన్నారు. సీపీఎం నాయకులు తిరుపతినాయక్‌తోపాటు స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజ్‌మహ్మద్, ఉపాధ్యక్షుడు ఆర్.వెంకటరాజం, నాయకులు రమేశ్ పాల్గొన్నారు.



దీక్ష శిబిరంలో నాయకులు

పాలిటెక్నిక్‌లో స్పాట్ సెలక్షన్స్

కోరుట్ల: స్థానిక పాలిటెక్నిక్‌లో సివిల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సుల్లో ఈనెల 28న స్పాట్ సెలక్షన్స్ నిర్వహిస్తారు. పదో తరగతిపాసై ఆసక్తి కలిగిన వారు ఈనెల 28 లోగా దరఖాస్తు చేసుకోవాలి. స్కాలర్‌షిప్, హాస్టల్ వసతి ఉండదు. ఏటా రూ.5,080 ఫీజు చెల్లించాలి. డిప్లొమా కోర్సులకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్, న్యూఢీల్లీ గుర్తింపు ఉందని అధికారులు పేర్కొన్నారు.

వ్యభిచార గృహాలపై మెరుపు దాడులు



వ్యభిచార గ్రాహాల్లో పోలీసుల తనిఖీలు

సాక్షి స్పందన

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని నిజామాబాద్‌రోడ్డు గాంధీనగర్ వ్యభిచార గృహాలపై పోలీసులు మంగళవారం సాయంత్రం మెరుపుదాడులు నిర్వహించారు. ఇంటింటా తనిఖీలు చేశారు. అనుమానాస్పదంగా కనిపించిన, సరైన సమాచారం ఇవ్వని ముగ్గురు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి గురించిన సమాచారం తెలుసుకునేందుకు విచారణ చేపట్టారు. పోలీసులు దాడులు చేస్తుండగా వ్యభిచార గృహాల్లోని కొందరు భయంతో పరుగులు తీశారు. పట్టణ సీఐ నటేశ్, రూరల్ సీఐ ఆరిఫ్ అలీఖాన్, మల్యాల సీఐ కోటేశ్వర్ ఆధ్వర్యంలో మెరుపు దాడులు చేశారు. కాగా, 'అందమైన యువతులు.. స్టేటస్‌లో ఫొటోలు' శీర్షికన ఈనెల 19న 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీంతో స్పందించిన జిల్లాపోలీసులు మెరుపు దాడులు చేయడం గమనార్హం.

తహసీల్దార్‌కు పదోన్నతి



వెంకటేశ్

ధర్మపురి: స్థానిక తహసీల్దార్ వెంకటేశ్‌కు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించినట్లు తెలిసింది. 2021 సెప్టెంబర్‌లో ఆయన ధర్మపురి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం.. డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పించినట్లు సమాచారం. మంగళవారం రాత్రి వరకు అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- అదనపు కలెక్టర్ దివాకర

జగిత్యాల: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ దివాకర ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో ప్రగతి పనులపై మంగళవారం సమీక్షించారు. వైకుంఠధామాలు, ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ల పురోగతిపై వెంటనే నివేదిక ఇవ్వాలన్నారు. హరితహారం మొక్కలను సంరక్షించాలని, గ్రీన్‌బడ్జెట్‌లో నిధులను పూర్తిగా వినియోగించాలని అన్నారు. భవన నిర్మాణ అనుమతులు సకాలంలో జారీ చేయాలని, నాలా కన్వర్షన్లను గుర్తించి లేవుట్ అనుమతుల కోసం చర్యలు తీసుకోవాలని తెలిపారు. పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ నరేశ్, డీఈ రాజేశ్వర్, రెవెన్యూ ఆఫీసర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన దివాకర తొలిసారి మున్సిపల్ కార్యాలయానికి రాగా చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ నరేశ్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.



స్వాగతం పలుకుతున్న శ్రీనివాస్, నరేశ్

సీనియర్ సిటిజన్లు సమాజ మార్గదర్శకులు

సీనియర్ సిటిజన్లు సమాజానికి మార్గదర్శకులని అడిషనల్ కలెక్టర్ దివాకర అన్నారు. సీనియర్ సిటిజన్స్ చట్టాల బుక్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ వెంకటస్వామిని కలిశారు. వృద్ధులను వేధిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ అన్నారు. సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లా అభివృద్ధి, స్థానిక అంశాలపై చర్చ



ఎమ్మెల్సీ కవితతో సమావేశమైన మంత్రి ఈశ్వర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

జగిత్యాల: హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ కవిత నివాసంలో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు విద్యాసాగర్‌రావు, సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ మంగళవారం ఆమెతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లాలో జరిగిన అభివృద్ధి, స్థానిక అంశాలపై చర్చించారు. మరిన్ని నిధులు కేటాయించాలని కోరారు.

నూతన నియామకం



భాగ్యలక్ష్మి

మెట్‌పల్లి(కోరుట్ల): ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని బండలింగాపూర్ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ అంగరి భాగ్యలక్ష్మిని నియమించారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మహాసభల్లో ఆమెను నియమించారు. ఆమె నియామకంపై నాయకులు ఉస్మాన్‌తోపాటు పలువురు హర్షం వ్యక్తం చేశారు.

స్క్రాప్ వాహనాల వేలం

జగిత్యాలక్రైం: జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో ఉన్న 70 స్క్రాప్ వాహనాలపై చట్టపరమైన విధానాలు అనుసరించి కేసులు నమోదు చేశామని ఎస్పీ భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరునెలలుగా వీటికోసం ఎవరూ రావడం లేదన్నారు. అందుకే స్క్రాప్‌గా పరిగణించి వాటికి వేలం వేస్తామన్నారు. అక్టోబర్ 2 ఉదయం 10 గంటలకు స్థానిక ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో స్క్రాప్ వాహనాలను వేలం వేస్తామని పేర్కొన్నారు. బహిరంగ వేలంలో పాల్గొనేవారు ఏదైనా గుర్తింపు కార్డు వెంట తీసుకుని రావాలని, ఇతర వివరాలకు 82478 70840 నంబరులో సంప్రదించాలని కోరారు.

చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం పరిశీలన



చేపపిల్లలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని అదనపు కలెక్టర్ బీఎస్ లత మంగళవారం పరిశీలించారు. జిల్లాలోని 712 కుంటల్లో 47.61 లక్షలు, 185 చెరువుల్లో కోటిన్నర చేపపిల్లలను పోస్తామని ఆమె చెప్పారు. ఈ మేరకు టెండర్లు కూడా పూర్తయ్యాయని తెలిపారు. జిల్లా మత్స్యశాఖాధికారి దామోదర్, మత్స్యకారులు పాల్గొన్నారు.

'ముస్లింలకు మంత్రి హరీశ్‌రావు క్షమాపణ చెప్పాలి'

మెట్‌పల్లి: ముస్లింలను ఫకీరులంటూ సంబోధించి అవమానించిన రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు వెంటనే క్షమాపణ చెప్పాలని మర్కజీ ఇంతేజామి కమిటీ అధ్యక్షుడు ఖుత్బుద్దీన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముస్లింలను ఓటు బ్యాంకుగా వాడుకుంటుందే తప్ప వారి సంక్షేమానికి కృషి చేయడం లేదన్నారు. 12 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని హామీ ఇచ్చి, ఇంతవరకు నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. ముస్లిం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని పేర్కొన్నారు.

811 మంది వీఆర్‌ఏలకు లబ్ధి

- క్రమబద్ధీకరణకు జీవో జారీ
- వివిధ శాఖల్లో సర్దుబాటుకు సర్కారు నిర్ణయం



కథలాపూర్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌ఏలు (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): క్రమబద్ధీకరణ కోసం ఏళ్లుగా చూస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకు(వీఆర్‌ఏ)లకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. వారిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తూ జీవో జారీచేసింది. దీంతో జిల్లాలో 811 మంది వీఆర్‌ఏలకు ప్రయోజనం చేకూరింది. అర్హతలను బట్టి జూనియర్, రికార్డు అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్‌లుగా నియమించాలని నిర్ణయించింది. ఇన్నాళ్లకు తమ కృషి ఫలించిందని వీఆర్‌ఏలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఫలించిన పోరాటం..

- వీఆర్‌ఏలను సర్వీస్ రెగ్యులరైజేషన్ చేయాలనే డిమాండ్‌తో గతేడాది జూలై 25 నుంచి సుమారు 80 రోజులపాటు విధులు బహిష్కరించి సమ్మెబాట పట్టారు.
- అప్పట్లో వీఆర్‌ఏలను క్రమబద్ధీకరిస్తామని సీఎం కేసీఆర్ నిర్ణయించారు.
- ప్రస్తుతం వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ వివిధ శాఖల్లో సర్దుబాటు చేయాలని జీవో జారీచేశారు.
- పరీక్ష రాసి డైరెక్ట్ రిక్రూట్ అయినవారితోపాటు మిగతా వీఆర్‌ఏలను, 61 ఏళ్ల పైబడినవారి వారసులకు విద్యార్హతలను బట్టి వివిధశాఖల్లో సర్దుబాటు చేయాలని నిర్ణయించారు.

విద్యార్హతలవారీగా వీఆర్‌ఏల వివరాలు

విద్యార్హత	వీఆర్‌ఏలు	పోస్టు	పేస్కేల్(రూ.లలో)
పదో తరగతి వరకు	568	లాస్ట్‌గ్రేడ్ సర్వీస్	19,000- 58,850
ఇంటర్ వరకు	94	రికార్డ్ అసిస్టెంట్	22,240-67,300
డిగ్రీ, ఆపై..	148	జూనియర్ అసిస్టెంట్	24,280 -72,850

విద్యార్హతను బట్టి కొలువులు

ప్రస్తుతం పనిచేస్తున్న వీఆర్‌ఏలకు గౌరవ వేతనం రూ.11,600 చెల్లిస్తారు. జిల్లాలోని పనిచేస్తున్న వీఆర్‌ఏలకు విద్యార్హతలను బట్టి స్కేల్ వర్తింపజేస్తారు. అంతేకాదు వేతనాలు అమాంతంగా పెరుగుతాయి. అయితే, తమను ఏ శాఖలో సర్దుబాటు చేస్తారోనని ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

కష్టాన్ని గుర్తించిన ప్రభుత్వం



గ్రామాల్లో నిరంతరం అందుబాటులో ఉండేది మేమే. రెగ్యులరైజేషన్ కోసం సమ్మె చేశాం. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు మా కష్టాలను గుర్తించి రెగ్యులరైజేషన్ చేశారు. ఏ శాఖలో సర్దుబాటు చేసినా మంచిగా సేవలు అందించి ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకుంటాం.

– రొడ్డ పోచయ్య, వీఆర్‌ఏల సంఘం నాయకుడు, కథలాపూర్

ఆనందంగా ఉంది



శాశ్వత కొలువు కోసం ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్నాం. వీఆర్‌ఏలను రెగ్యులరైజేషన్ చేయడంతోపాటు పేస్కేల్ అమలు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉంది. వీఆర్వో వ్యవస్థ రద్దయ్యాక వీఆర్‌ఏలపై పనిభారం పెరిగింది. అయినా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాం.

– తుమ్మల నాగరాజు, వీఆర్‌ఏల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి



నేడు ఎస్సారెస్పీ నీటి విడుదల

- నేటినుంచి జిల్లాకు సాగునీరు
- కాకతీయ కాల్వ ద్వారా విడుదల
- అసహనం వ్యక్తం చేస్తున్న రైతులు

జగిత్యాలఅగ్రికల్చర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాల్వ ద్వారా బుధవారం సాగునీరు విడుదల చేయనున్నారు. వానాకాలం పంటల కోసం రాష్ట్రమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నీటిని విడుదల చేస్తారు. కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తుండటంతో ఓ వైపు ప్రాజెక్టులో నీటి మట్టం పెరుగుతూ వస్తోంది. ఇదే సమయంలో వ్యవసాయ బావులు, కుంటలు, చెరువుల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. ఇలాంటి తరుణంలో నీటి విడుదలపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాజెక్టు నిండకున్నా విడుదల ఏమిటి?

- శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఇంకా పూర్తిస్థాయిలో నిండలేదు.
- అయినా, నీటిని ఎందుకు విడుదల చేస్తున్నారనే సందేహాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు.
- ప్రాజెక్టులో పూర్తిస్థాయి నిల్వలు ఉంటే.. వానాకాలంతోపాటు యాసంగి పంటలకు కూడా నీరు అందించే అవకాశం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.
- జిల్లాలో 3 లక్షల ఎకరాల వరకు వరి సాగు చేస్తున్నారు.
- ఇప్పటికే వ్యవసాయ బావుల్లోని నీటితో దాదాపు 2 లక్షల ఎకరాల వరకు వరినాట్లు వేశారు.
- మిగతా లక్ష ఎకరాల్లోనూ నాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు.
- ఇందుకు అవసరమైన నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయి.
- ఈతరుణంలో విలువైన నీటిని ఇప్పుడు విడుదల చేయడం ద్వారా పెద్దగా ఉపయోగం లేదని అన్నదాతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

19,722 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..

ఎగువ నుంచి ప్రాజెక్టులోకి ప్రస్తుతం 19,722 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1,091.00 అడుగులు కాగా మంగళవారం సాయంత్రం వరకు 1,084.00 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటి నిల్వలు 90.3 టీఎంసీలు కాగా 63.75 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టు నుంచి అలీసాగర్ ఎత్తిపోతలకు 270 క్యూసెక్కులు, తాగు నీటి అవసరాల కోసం 1,002 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఈఏడాది జూన్ 1 నుంచి 45.979 టీఎంసీలు ప్రాజెక్టులోకి వచ్చి చేరింది. కాళేశ్వరం ఎత్తి పోతల ద్వారానే సుమారు 2.536 టీఎంసీలు వచ్చిచేరినట్లు అధికారులు తెలిపారు.

రాజన్న ఆలయంలో విజిలెన్స్ దాడులు

- బెంబేలెత్తిన అధికారులు
- సిబ్బందిలో అయోమయం



ఈవో కృష్ణప్రసాద్‌తో చర్చిస్తున్న విజిలెన్స్ అధికారులు

వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయంలో మంగళవారం విజిలెన్స్ దాడులు జరిగాయి. సీఐలు అనిల్‌కుమార్, వరుణ్‌ప్రసాద్, తహసీల్దారు దినేశ్‌రెడ్డి, ఏఈ శశిధర్, ఇద్దరు కానిస్టేబుళ్ల బృందం ఆలయానికి చేరుకుంది. ముందుగా ప్రసాదాల తయారీ గోదాం, ప్రసాదాల విక్రయ కౌంటర్లు, ఆలయంలోని విభాగాలను తనిఖీ చేసి రికార్డులు స్వాధీనపరచుకున్నారు. అనంతరం ఈవో చాంబర్‌కు చేరుకుని రికార్డులు పరిశీలించారు. ప్రసాదాల తయారీకి వాడే కాజు, కిస్మిస్, చక్కెర మిశ్రమాల తీరు, గోదాంలోని స్టాక్, ప్రసాదాల కౌంటర్‌లోని స్టాక్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆలయంలో అధికారుల సీనియారిటీ జాబితా, ఉద్యోగుల ప్రమోషన్‌లో తీసుకున్న చొరవ, గతంలో విజిలెన్స్ కేసుల్లో ఉన్నవారి వివరాలు, వారు చేస్తున్న డ్యూటీపై విచారణ చేపట్టారు. కాగా విజిలెన్స్ అధికారుల తనిఖీలతో అధికారులు, సిబ్బంది అయోమయానికి గురయ్యారు. ఎక్కడి వారక్కడే తమతమ విభాగాల్లో పనులు చేసుకుంటూ కనిపించారు. ఈవిషయంపై విజిలెన్స్ అధికారులను విలేకరులు ప్రశ్నించగా, తమకు అందిన ఫిర్యాదుల మేరకు ఆలయంలో తనిఖీలు నిర్వహించి, రికార్డులు స్వాధీనం చేసుకున్నామని, ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.

మ్యాడారంతండాలో శీత్లాభవాని వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న గిరిజన లంబాడీలు

సారంగాపూర్: మండలంలోని మ్యాడారంతండా గ్రామంలో మంగళవారం సాయంత్రం శీత్లాభవాని వేడుకలను గిరిజన లంబాడీలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ భూక్య అరుణ్‌కుమార్ తన సొంత ఖర్చులతో గ్రామంలో నూతనంగా నిర్మించిన శీత్లాభవాని ఆలయంలో ఏడుగురు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి, తీజ్ వేడుకలకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా మేకలను బలిచ్చి, మొక్కులు చెల్లించుకున్నారు. లంబాడా సంఘాల రాష్ట్ర నాయకుడు భూక్య దశరథ్‌నాయక్, మార్క్‌ఫెడ్ డీఎం దివ్యభారతి, ట్రాన్స్‌కో ఏడీఈ జవహర్‌లాల్ నాయక్, ఎంపీటీసీ సభ్యురాలు భూక్య లావణ్య రాథోడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు భూక్య సరళ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బలహీనవర్గాలకు రాజ్యాధికారం

- కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హన్మంతరావు



మాట్లాడుతున్న వి.హన్మంతరావు, పక్కన కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌టౌన్: బలహీనవర్గాలకు రాజ్యాధికారం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హన్మంతరావు అన్నారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ ఐక్య వేదిక సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా వి.హనుమంతరావు, మంథని శాసనసభ్యుడు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శాసనమండలి సభ్యుడు జీవన్‌రెడ్డి హాజరయ్యారు. వి.హనుమంతరావు మాట్లాడుతూ.. చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగిందని, ఇలాంటి ముఖ్యమంత్రిని నేను ఎన్నడు చూడలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీసీల గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కాంగ్రెస్ పార్టీలోనే న్యాయం జరిగిందని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మల్లిఖార్జున ఖర్గేను ఏఐసీసీ అధ్యక్షుడిగా నియమించడం జరిగిందని అన్నారు. తాను రెడ్డి సామాజికవర్గానికి చెందినవాడినైతే ఎప్పుడో ముఖ్యమంత్రి అయ్యేవాడినని అన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ 60శాతం ఉన్న బలహీనవర్గాల వారికి సముచిత స్థానం కల్పించాలన్నారు. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ బలహీన వర్గాలకు చెందిన వారిని పీసీసీ అధ్యక్షులుగా ఎంతో మందికి అవకాశం కల్పించిందని ఇది వేరే పార్టీల వల్ల అవుతుందా అని అన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్, ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్, మక్కాన్ సింగ్, ఈర్ల కొమురయ్య, వైద్యుల అంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొన్నం దూరం...

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిటీలో చోటు కల్పించకపోవడంపై అలకబూనిన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ బీసీ ఐక్య వేదిక సమావేశానికి హాజరు కాలేదు. పొన్నం అనుచరులు సైతం హాజరుకాకపోవడంతో సభ వెలవెలపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ నేతృత్వంలో బీసీ నేతలు చొరవ తీసుకొని ఉదయం నుంచే ఉమ్మడి జిల్లాలోని నాయకులందరికీ ఫోన్లు చేసి కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు కృషిచేశారు.

గాయాలు కాలేదని చెప్పి.. అనంతలోకాలకు

- బొలెరో వాహనం, కారు ఎదురెదురుగా ఢీ
- బంధువులతో ఫోన్‌లో మాట్లాడిన అరగంటకే మృతి
- మృతుడు ధర్మపురి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు
- బంజేరుపల్లి తండా బి వద్ద ఘటన



ప్రమాదం తర్వాత ఫోన్‌లో మాట్లాడుతున్న సత్యనారాయణ



సత్యనారాయణ (ఫైల్)

ధర్మారం/ధర్మపురి: రోడ్డు ప్రమాదానికి గురైన కారులో నుంచి దిగాడు.. తనకు ఎలాంటి గాయాలు కాలేదని బంధువులకు ఫోన్‌లో తెలిపాడు.. ఆ తర్వాత అరగంటకే అనంతలోకాలకు వెళ్లిపోయాడు ధర్మపురికి చెందిన న్యాయవాది బండారి సత్యనారాయణ(49). ప్రత్యక్ష సాక్షులు, మృతుడి బంధువుల కథనం ప్రకారం.. సత్యనారాయణ గతంలో ధర్మపురి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పని చేశారు. మంగళవారం జగిత్యాల కోర్టులో పని ముగించుకొని, తన సొంత పనులపై కారులో కరీంనగర్ వెళ్లారు. అక్కడి నుంచి ధర్మపురి వస్తుండగా పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని బంజేరుపల్లి తండా బి గ్రామం వద్ద ఆయన కారు, మేకల లోడ్‌తో ఆర్నకొండ వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బొలెరో రోడ్డు కింద బోల్తా పడింది. ఆ వాహన డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కారు బెలూన్స్ ఓపెన్ కావడంతో సత్యనారాయణ ఒంటిపై ఎలాంటి గాయాలు కాలేదు. ఆయన బయటకు వచ్చి, వెంటనే తన బంధువులకు ఫోన్‌లో జరిగిన విషయం చెప్పారు. తనకు ఎలాంటి గాయాలు కాలేదన్నారు.

గతంలో గుండెకు స్టంట్లు..

అప్పటికే స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 వాహనం సంఘటన స్థలానికి చేరుకుంది. వాహనంలోకి ఎక్కిస్తుండగానే సత్యనారాయణ ప్యాంట్‌లో మూత్ర విసర్జన చేసినట్లు స్థానికులు తెలిపారు. చికిత్స నిమిత్తం కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఆయన గుండెకు కొన్ని నెలల క్రితం స్టంట్లు పడినట్లు బంధువులు పేర్కొన్నారు. మృతుడికి భార్య శోభ, ఇంటర్ చదివే కుమారుడు, ఐదో తరగతి చదివే కూతురు ఉన్నారు. సత్యనారాయణ చనిపోయిన వార్త తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బొలెరో వాహనం వేగంగా వచ్చి, ఢీకొట్టడం వల్లే సత్యనారాయణ చనిపోయాడని మృతుడి బాబాయి కుమారుడు రాజమహేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బొలెరో డ్రైవర్, ఆర్నకొండకు చెందిన సంతోష్ రెడ్డిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ పేర్కొన్నారు.

మణిపూర్ అల్లర్లకు వ్యతిరేకంగా నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం, సీపీఐ నాయకులు

జగిత్యాలటౌన్: మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లను వ్యతిరేకిస్తూ సీపీఎం, సీపీఐ పార్టీలు ఆందోళన నిర్వహించాయి. రాష్ట్ర పార్టీల పిలుపుమేరకు మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట నిర్వహించిన ఆందోళనలో లెఫ్ట్ పార్టీల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మణిపూర్ అల్లర్లను జాతుల ఘర్షణగా చిత్రీకరించే ప్రయత్నం మానుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు వాస్తవ పరిస్థితులను తెలియకుండా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మణిపూర్‌లో శాంతిపరిరక్షణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. శాంతిని నెలకొల్పడంలో మణిపూర్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని, ఆ ప్రభుత్వాన్ని తొలగించి రాష్ట్రపతి పాలన విధిం, ప్రజలకు భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చోరీ కేసులో దొంగ అరెస్టు

జగిత్యాల క్రైం: చోరీ కేసులో ఓ దొంగను అరెస్టు చేసినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పొలాస గ్రామంలో బూర్ల చంద్రమౌళి కిరాణా దుకాణంలో అదే గ్రామానికి చెందిన వడ్లూరి గణేశ్ గత నెలలో చొరబడ్డాడు. రూ.26 వేలతోపాటు సామగ్రి ఎత్తుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా గణేశ్‌ను మంగళవారం అదుపులోకి తీసుకొని, విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. అంతేకాకుండా జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసినట్లు చెప్పడంతో రిమాండ్‌కు తరలించారు.

ఏడుగురు పేకాటరాయుళ్లు..

రాయికల్ మండలం తాట్లవాయి గ్రామ శివారులోని ఓ రహస్య ప్రాంతంలో పేకాట స్థావరంపై ఎస్సై అజయ్ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు చేశారు. ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ.23,940 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని పద్మనగర్ గ్రామ శివారు ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సిరిసిల్ల పట్టణానికి చెందిన ద్విచక్ర వాహనదారు బుడిగె యాదగిరి తీవ్రంగా గాయపడ్డాడు. రోడ్డు పక్కన రక్తపు మడుగులో ఉన్న యాదగిరిని వాహనదారులు గుర్తించి 108కు సమాచారం అందివ్వడంతో అతడిని వెంటనే సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యాదగిరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. కాగా ప్రమాదానికి సంబంధించిన కారణాలు తెలియరాలేదు. ఏదైనా వాహనం ఢీకొట్టిందా లేదా తనకు తానుగా అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడా తెలియాల్సి ఉంది.

పాత పింఛన్ విధానమే మేలు



సభ్యత్వ నమోదులో నాయకులు

జగిత్యాలరూరల్: పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనందరావు కోరారు. పొరండ్ల, బాలపల్లి, తాటిపల్లి, మోరపల్లి, చల్‌గల్, అంతర్గాం, నర్సింగాపూర్ పాఠశాలల్లో మంగళవారం సభ్యత్వ నమోదు చేశారు. ఆయన మాట్లాడుతూ, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. రూ.లక్షలోపు ఉన్న పెండింగ్ బిల్లులను ఈనెలాఖరులోగా విడుదల అవుతాయని తెలిపారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు బొమ్మకంటి శ్రీనివాస్, రాంరెడ్డి, చంద్రశేఖర్, భూపాల్‌రావు, నర్సయ్య, రాకేశ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అదనంగా చెల్లిస్తామంటూ రూ.2.81 లక్షలకు టోకరా

- సైబర్ క్రైం కేసు నమోదు

జ్యోతినగర్(రామగుండం): పెట్టుబడికి 30 శాతం అదనంగా చెల్లిస్తానని చెప్పడంతో ఓ వ్యక్తి పెట్టుబడి పెట్టి, మోసపోయిన ఘటనపై ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో సైబర్ క్రైం కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఖాజీపల్లికి చెందిన హర్షవర్ధన్ ఈ నెల 2న టెలిగ్రాంలో వచ్చిన సంక్షిప్త సమాచారంతో సంబంధిత వ్యక్తికి కాల్ చేశాడు. అతను పెట్టుబడి పెట్టిన సొమ్ముకు అదనంగా 30 శాతం చెల్లిస్తామని చెప్పడంతో రూ.2,81,000 ఇన్వెస్ట్ చేశాడు. రోజులు గడిచినా అధిక మొత్తం రాకపోవడంతో సంబంధిత వ్యక్తితో మాట్లాడగా మరో రూ.7 లక్షలు పెట్టుబడి పెడితే మొత్తం కలిపి ఇస్తామన్నాడు. దీంతో హర్షవర్ధన్ తాను మోసపోయానని గ్రహించి, మంగళవారం ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సైబర్ క్రైం కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీవన్ తెలిపారు.